క్లుప్తంగా

ఇష్టపడుతూ కష్టపడి చదవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే చిట్టిబాబు

అంబాజీపేట: చిన్నతనం నుంచీ ప్రతి విద్యార్థీ ఇష్టపడుతూ, కష్టపడి చదవాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. ఇరుసుమండ సెయింట్ జోసఫ్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ యాన్యువల్ డే సెలబ్రేషన్స్ కరస్పాండెంట్ సిస్టర్ రేణి అధ్యక్షతన గురువారం రాత్రి జరిగాయి. ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంత్రి, ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్రమశిక్షణతో విద్య నేర్చుకోవాలన్నారు. అర్థమయ్యే విధంగా బోధించడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయవచ్చన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యురాలు బుడితి సత్యనారాయణమ్మ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, హెచ్ఎం సిస్టర్ సునిమోల్, సర్పంచ్‌లు అక్కిశెట్టి నాగమణి, జల్లి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: లొల్ల గ్రామంలో స్థానిక యువజన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంబేడ్కర్ ఆలోచనలు భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.

సచివాలయ కన్వీనర్లు నూతనోత్తేజంతో పని చేయాలి

పి.గన్నవరం: వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా గ్రామ సచివాలయ కన్వీనర్లు నూతనోత్తేజంతో పని చేయాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. పి.గన్నవరంలోని పార్టీ కార్యాలయంలో మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం జరిగిన సచివాలయ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీ అధిష్టానం సూచించిన ప్రతి కార్యక్రమాన్నీ విజయవంతం చేయాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు, మండల జేసీఎస్ కన్వీనర్ దొమ్మేటి దుర్గారావు, నాయకులు పాల్గొన్నారు.

నూతన ఎస్సై బాధ్యతల స్వీకరణ



సఖినేటిపల్లి: స్థానిక పోలీస్ స్టేషన్ ఎస్సైగా ఎస్.రాము గురువారం బాధ్యతలు చేపట్టారు. అమలాపురం క్రైం స్టేషన్ నుంచి బదిలీపై ఆయన సఖినేటిపల్లి వచ్చారు. బాధ్యతలు చేపట్టిన రాముకు సిబ్బంది, పలువురు నాయకులు అభినందనలు తెలిపారు.

పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ బహూకరణ

రావులపాలెం: ఈతకోట హైస్కూల్‌కు గ్రామానికి చెందిన యలమర్తి కృష్ణ రూ.15 వేల విలువైన పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ (మైక్ సెట్) గురువారం బహూకరించారు. దీనిని హెచ్ఎం కేఎస్‌వీ కృష్ణారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ బి.తేజ, వైస్ చైర్మన్ వి.శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైకిల్ తొక్కితే సంపూర్ణ ఆరోగ్యం

అంబాజీపేట: సైకిల్ తొక్కడం వలన ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని వైద్యాధికారి వి.గౌతమి అన్నారు. ఆరోగ్య మేళా కార్యక్రమంలో భాగంగా అంబాజీపేట పీహెచ్‌సీ ఆధ్వర్యాన 'సైకిల్ తొక్కండి – ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకోండి, ప్రకృతిని కాపాడండి' అనే నినాదంతో విద్యార్థులతో గురువారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమి మాట్లాడుతూ, సైకిల్ తొక్కడం వలన గుండె వ్యాధులతో దీర్ఘకాలిక వ్యాధులకు స్వస్తి చెప్పవచ్చని అన్నారు. సైక్లింగ్‌తో ఒత్తిడి దూరమై, మానసికోల్లాసం కలుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ రోజుకు గంట పాటు సైకిల్ తొక్కడం ఆరోగ్యానికి ఎంతో లాభదాయకమన్నారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీ నుంచి నాలుగు రోడ్ల సెంటర్ వరకూ సైకిల్ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విజ్ఞాన వీచిక



ఆకట్టుకున్న శ్యామ్ జాదూగర్ సైంటిఫిక్ మ్యాజిక్ షో



రెక్టివ్ వేల్యూస్ అప్లికేషన్ ఆఫ్ ట్రిగెమెంట్స్ ప్రదర్శన ఇస్తున్న కాశీవిశ్వనాథ్, సుందరరాజు



విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రసంగిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

- ఆకట్టుకున్న విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన
- విభిన్న ప్రాజెక్టులు ప్రదర్శించిన విద్యార్థులు

అంబాజీపేట: విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యాన్ని చాటడానికి అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో డీఈఓ ఎం.కమలకుమారి అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన వేదికగా నిలిచింది. ఈ ప్రదర్శనను కలెక్టర్ హిమాన్షు శుక్లా ముఖ్య అతిథిగా ప్రారంభించి, విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు. పర్యావరణం, ఆరోగ్యం, పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్, ఆండ్రాయిడ్ యాప్‌లు, పర్యావరణం, వాతావరణ మార్పులు, గణిత భావన నమూనాల విభాగాల్లో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ప్రముఖ మెజీషియన్ శ్యామ్ జాదూగర్ ప్రదర్శించిన సైంటిఫిక్ మ్యాజిక్ షో, పిల్లి గోవిందరాజు నిర్వహించిన పప్పెట్రీ డాన్స్ షో పలువురిని అలరించాయి. ఈ సందర్భంగా చిరతపూడి హెచ్ఎం నూకల సత్యనారాయణ గ్రామఫోను రికార్డులతో వీనుల విందైన ఆపాత మధురాలను వినిపించారు. పాత తరం నాటి అపురూప వస్తువులు సేకరించడం తన హాబీ అని, పాత కాలం నాటి రేడియోలు, గడియారాలు వంటివి భద్రపరిచానని చెప్పారు.

ఆరోగ్య సంరక్షణ ముఖ్యం

ఆత్రేయపురం మండలం ర్యాలి జెడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని పువ్వాల జోత్స్న శ్రీదేవి, గైడ్ టీచర్ కె.సత్యనారాయణ ఈ ప్రాజెక్టు తయారు చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులు, కోవిడ్ తరువాత వచ్చిన మార్పుల వల్ల ప్రజలు అనేక రోగాలతో బాధ పడుతున్నారు. దీనిని ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ పర్యావరణంతో పాటు ఆరోగ్యాన్ని కూడా పరిరక్షించుకోవచ్చని నిరూపించారు. ఊపిరితిత్తులు, గుండె, కాలేయం సంబంధిత వ్యాధులపై ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



ఆరోగ్య సంరక్షణ, కాలుష్య నివారణపై వివరిస్తున్న జోత్స్న శ్రీదేవి

ట్రిగనోమెట్రిక్ రేషియో వేల్యూస్

గణితంలో త్రికోణమితి (టిగనోమెట్రీ) అంటే దాదాపు విద్యార్థులందరికీ భయమే. అటువంటి భయం అవసరం లేదని చెబుతూ.. ఆలమూరు మండలం చెముడులంక జెడ్పీ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న ఎస్.కాశీ విశ్వనాథ్, డి.సుందరరాజులు గైడ్ టీచర్ సహకారంతో 'ట్రిగనోమెట్రిక్ రేషియో వేల్యూస్' ప్రాజెక్టు రూపొందించారు. దీని ద్వారా త్రికోణమితి లెక్కలు సులువుగా చేసే వీలుంటుంది.

ప్లాస్టిక్ నియంత్రణ.. కాలుష్య నివారణ

ప్లాస్టిక్ నియంత్రణ ద్వారా కాలుష్యాన్ని నివారించే అంశంపై అయినవిల్లి మండలం కొండుకుదురు జెడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని పల్లా వెంకట సత్య సింధూజ ఈ ప్రాజెక్టు తయారు చేసింది. ప్లాస్టిక్‌ను నియంత్రణకు పర్యావరణ హిత పదార్థాలు, పండ్లు, క్యారెట్ దుంపలతో ప్లేట్లు, గిన్నెలు, కొబ్బరి ఆకులతో స్ట్రాలు, ప్రకృతి సహజసిద్ధమైన వస్తువులు వాడాలని, వీటిని వినియోగించడం వలన వెంటనే మట్టిలో కలసిపోతాయయని, పర్యావరణానికి ఎటువంటి హానీ జరగదని వివరించింది. గైడ్ టీచర్ ఎస్.మాధురి సహకారంతో ఆమె ఈ ప్రాజెక్టు రూపొందించింది.

సాఫ్ట్‌వేర్, యాప్స్‌తో అర్థవంతమైన బోధన



సాఫ్ట్‌వేర్, యాప్స్ ఉపయోగాన్ని వివరిస్తున్న శరణ్య నాగసుధ

బోధనలో కొత్త పోకడలకు ఈ ప్రదర్శన అద్దం పట్టేలా రాయవరం మండలం వెంటూరు జెడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని చెల్లుబోయిన శరణ్య నాగసుధ, గైడ్ టీచర్ ఆర్.సాయిబాబు ఈ ప్రాజెక్టును తయారు చేశారు. సాఫ్ట్‌వేర్, యాప్‌లను ఉపయోగించి వర్చువల్ ఇమేజెస్‌ను వాస్తవిక ప్రపంచంతో అనుసంధానం చేస్తూ విద్యార్థులను ఆకట్టుకునే రీతిలో బోధన చేయవచ్చని నిరూపించారు. సంక్లిష్టమైన బోధనాంశాలను సైతం ఎటువంటి బోధన పరికరాలు లేకుండానే ఈ యాప్ ద్వారా అనుసంధానం వివరించారు.



ప్రాజెక్టును ప్రదర్శిస్తున్న వెంకట సత్య సింధూజ

సర్వం సిద్ధం

- రేపు శని త్రయోదశి, మహా శివరాత్రి పర్వదినాలు
- శనైశ్చర క్షేత్రం మందపల్లిలో విస్తృత ఏర్పాట్లు
- లక్ష మందికి పైగా భక్తులు వస్తారని అంచనా



మందపల్లిలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌డీఓ ముక్కంటి

కొత్తపేట: శని త్రయోదశి, మహా శివరాత్రి పర్వదినాల సందర్భంగా మందపల్లి ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామివారి క్షేత్రంలో పూజలు, తైలాభిషేకాలు, భక్తుల సౌకర్యాలకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. రెండు దశాబ్దాల తరువాత మహా శివరాత్రి, అమావాస్య ముందు శని త్రయోదశి పర్వదినాలు శనివారం కలిసి వస్తున్నాయి. దీంతో ఈ రోజు ఎంతో విశిష్టత సంతరించుకుంది. ఈ నేపథ్యంలో శనిదోష నివారణకు దేశవ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన మందపల్లి శనైశ్చర క్షేత్రానికి లక్ష మందికి పైగా భక్తులు వస్తారని దేవదాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ఆ రోజు క్షేత్రానికి వచ్చే భక్తులు ఎటువంటి ఇబ్బందులూ పడకుండా పూజలు, తైలాభిషేకాలు జరిపించి, స్వామి వారి దర్శనం చేసుకుని తిరిగి వెళ్లేలా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు ఆర్‌డీఓ ఎం.ముక్కంటి పర్యవేక్షణలో దేవదాయ, ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ ఎం.విజయరాజు ఆధ్వర్యాన దేవస్థానం ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ సింగం రాధ, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఈ ఏర్పాట్లను గురువారం సాయంత్రం ఆర్‌డీఓ ముక్కంటి పరిశీలించారు.

- ఇటీవల అంతర్వేదిస్వామి వారి కల్యాణోత్సవాలు విజయవంతంగా నిర్వహించిన ఆ దేవస్థానం ఈఓ వి.సత్యనారాయణను మందపల్లి క్షేత్రంలో చీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్(సీఎఫ్ఓ)గా నియమించారు.
- భక్తులు అభిషేక పూజలు నిర్వహించే స్థలాల్లో షామియానాలు, విద్యుత్ సౌకర్యం, స్నానాల రేవుల వద్ద భద్రతా చర్యలతో పాటు రేవుకు ఇద్దరు చొప్పున గజ ఈతగాళ్లను నియమించారు.
- గట్లపై జల్లు స్నానాలకు పైపులైన్లు, దుస్తులు మార్చుకునేందుకు సైడ్‌వాల్స్‌తో షెడ్లు ఏర్పాటు చేశారు.
- తొక్కిసలాటకు అవకాశం లేకుండా బారికేడ్లతో క్యూలు ఏర్పాటు చేశారు.



కాలువ రేవులో జల్లు స్నానానికి ఏర్పాటు చేసిన పైపులైన్లు

- ఒక్కో యూనిట్‌కు 12 చొప్పున మూడు ప్రాంతాల్లో 36 మొబైల్ టాయిలెట్స్ ఏర్పాటు చేశారు.
- పవర్ ప్లాంట్ స్థలం, రోడ్డులో వాహనాల పార్కింగ్‌కు నిర్దేశించారు.
- నియోజకవర్గంలోని వివిధ పీహెచ్‌సీల ద్వారా 5 ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు.
- ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 2 లక్షల వాటర్ ప్యాకెట్లు సిద్ధం చేశారు.
- తైలాభిషేకం, దర్శనానికి సంబంధించి వీఐపీలు, వీవీఐపీలకు ఒక క్యూ, సాధారణ భక్తులకు మూడు క్యూలు ఏర్పాటు చేశారు.
- రావులపాలెం వైపు నుంచి కోనసీమకు, అమలాపురం వైపు నుంచి రావులపాలెం వైపు వెళ్లే ఆర్టీసీ, ఇతర వాహనాలను ఈతకోట, పలివెల మీదుగా మళ్లించనున్నారు.
- భక్తుల సౌకర్యార్థం రావులపాలెం నుంచి మందపల్లి క్షేత్రానికి 10 ఆర్టీసీ బస్సులు నడపనున్నారు.
- డీఎస్పీ కేవీ రమణ ఆధ్వర్యాన కోనసీమలోని వివిధ స్టేషన్ల నుంచి పోలీసు అధికారులతో పాటు సుమారు 150 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.
- అభిషేకాలు నిర్వహించే ప్రాంతాల్లో తహసీల్దార్లు, ఎంపీడీఓలను ఇన్‌చార్జిలుగా నియమించారు.

నిధుల మంజూరుకు కృతజ్ఞతలు

మలికిపురం: శంకరగుప్తం డ్రైన్ రివిట్‌మెంట్‌కు, ఏటిగట్టు నిర్మాణానికి రూ.7 కోట్లు మంజూరు చేసినట్టు ప్రకటించిన కలెక్టర్ హిమాన్షు శుక్లాకు బీజేపీ సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. తూర్పుపాలెంలో గురువారం జరిగిన సమావేశంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ, నాయకులు, సర్పంచ్ గుర్లింక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. ఇక్కడ ఉప్పునీటి ప్రభావంతో కొబ్బరి తోటలు చనిపోతున్నాయని, దీనిపై ప్రభుత్వ చర్యలు బాగున్నాయని నాయకులు పేర్కొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

ఆలమూరు: సంధిపూడిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. స్థానిక శ్రీ వేణుగోపాల స్వామి ఆలయంలో గోవింద మాలధారుల బృందం ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో తాడి మురళీకృష్ణ, వెంకట రత్నకుమారి దంపతులు పాల్గొన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా మార్టేరుకు చెందిన వేద పండితులు శ్రీనివాసుల విజయకుమార్ ఆచార్యులు మంత్రోచ్చారణ నడుమ మురళీకృష్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. తొలుత గ్రామోత్సవం నిర్వహించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన




బాలబాలాజీ సన్నిధిలో అర్చకుల ఆశీర్వచనం అందుకుంటున్న ఎస్ఈ శ్రీనివాసమూర్తి

మామిడికుదురు: పాశర్లపూడి – అప్పనపల్లి మధ్య రూ.12 కోట్లతో చేపట్టిన సిమెంట్ కాంక్రీట్ రోడ్డు పనులను రహదారులు, భవనాల శాఖ (ఆర్అండ్‌బీ) ఎస్ఈ ఆర్.శ్రీనివాసమూర్తి గురువారం పరిశీలించారు. ఆయన వెంట ఆర్అండ్‌బీ ఈఈలు రాము, శ్రీనివాసనాయక్, డీఈఈలు హరిప్రసాద్, రవి, ఏఈ వై.సత్యనారాయణ ఉన్నారు. సీసీ రోడ్డు పరిశీలన అనంతరం అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారిని శ్రీనివాసమూర్తి దర్శించుకున్నారు. ఉభయ దేవేరులతో కొలువు తీరిన స్వామి వారిని దర్శించిన అనంతరం అర్చకుల నుంచి ఆశీర్వచనం అందుకున్నారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను ఈఓ ఎంకేటీ నాగవరప్రసాద్, ట్రస్టు బోర్డు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, ట్రస్టు బోర్డు సభ్యుడు కొమ్ముల సూరిబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పొలంబడితో మెరుగైన ప్రయోజనాలు

మలికిపురం: పొలంబడితో రైతులకు మెరుగయిన ప్రయోజనాలు చేకూరుతున్నాయని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్ అన్నారు. విశ్వేశ్వరాయపురంలో గురువారం జరిగిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇష్టానుసారం క్రిమి సంహారక మందులు వినియోగించడం అనర్థాలకు దారి తీస్తుందన్నారు. ఎలుకల నిర్మూలనలో రైతులకు మెళకువలు తెలియజేశారు. జిల్లా వ్యవసాయ మండలి సభ్యులు గుబ్బల రమేష్, ఏఓ ఎస్.రాకేష్, రైతులు, అగ్రికల్చరల్ అసిస్టెంట్లు, రైతు భరోసా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు



అప్పనపల్లి మైనర్ రాజుగారి వీధిలో రూపాయి నాణేలతో రూపొందించిన శివలింగం

మామిడికుదురు: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు ఆలయాల వద్ద విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. పెదపట్నం, పెదపట్నంలంక, అప్పనపల్లి, బి.దొడ్డవరం, మామిడికుదురు, నగరం, మొగలికుదురు, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, లూటుకుర్రు, ఆదుర్రు, ఈదరాడ, కొమరాడ, మగటపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల వద్ద శివరాత్రి ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. అప్పనపల్లి మైనర్ రాజుగారి వీధిలో శ్రీ బాల గణపతి మిత్ర బృందం ఆధ్వర్యాన రూపాయి నాణేలతో తయారు చేసిన శివలింగం ఆకట్టుకుంటోంది. అదే గ్రామంలోని సంతపేటలో జై గౌరీశంకర భక్త బృందం ఆధ్వర్యంలోను, మొగలికుదురులోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం వద్ద శివరాత్రి సందర్భంగా ప్రత్యేక సెట్టింగులు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో 10,116 జ్యోతులతో దీపాలంకరణ, ఇతర సెట్టింగులు చేయనున్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ స్వామి వారి నిత్యాన్నదానం ట్రస్టుకు పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురానికి చెందిన చింతల శ్రీనివాసరావు, శాంతి దంపతులు తమ కుమార్తె సిద్దిక్ష శ్రితిక పుట్టిన రోజు సందర్భంగా గురువారం రూ.10,116 విరాళం సమర్పించారు. ఈ మొత్తంపై వచ్చే వడ్డీతో ఏటా జనవరి 24న అన్నదానం నిర్వహించాలని కోరారు. విరాళాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఈఓ ఎంకేటీ నాగ వరప్రసాద్‌కు అందించారు.

దాతకు స్వామి వారి చిత్రపటం, పాటు ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యుడు కొమ్ముల సూరిబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పాఠశాల సుందరీకరణకు రూ.లక్ష విరాళం



హెచ్ఎం నిరంజనికి విరాళం అందజేస్తున్న పూర్వ విద్యార్థి సోమనాథరావు

మామిడికుదురు: స్థానిక జెడ్పీ హైస్కూలు సుందరీకరణకు ఆంధ్రా యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు పాలూరి సోమనాథరావు గురువారం రూ.లక్ష విరాళం అందజేశారు. లూటుకుర్రు గ్రామానికి చెందిన ఆయన ఈ పాఠశాల పూర్వ విద్యార్థి. విరాళం మొత్తాన్ని ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ నిరంజనికి ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తనను ప్రయోజకుడిని చేసిన పాఠశాల రుణం ఎంత ఇచ్చినా తీర్చుకోలేనిదని అన్నారు. పాఠశాలలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటించి, పరిసరాలను ఆహ్లాదంగా తయారు చేయించాలన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, విళ్ల సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యానిమేటర్లు సక్రమంగా విధులు నిర్వర్తించాలి

ఆత్రేయపురం: డ్వాక్రా యానిమేటర్లు సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఎంపీడీఓ నాతి బుజ్జి తెలిపారు. యానిమేటర్లతో మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆమె సమీక్ష నిర్వహించారు. ఇటీవల డ్వాక్రా గ్రూపులకు సంబంధించి పలు అంశాలపై తరచుగా స్పందనలో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. డ్వాక్రా మహిళల సమస్యల పరిష్కారానికి యానిమేటర్లు అందుబాటులో ఉండాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో జగనన్న గోరుముద్ద అమలును పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వరప్రసాద్, ఏపీఎం అప్పలకొండ, సీసీ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

ఆత్రేయపురం: బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడటో నాతి బుజ్జి ఆదేశించారు. మండలంలోని కట్టుంగ, నార్కెడ్‌మిల్లి, అంకంపాలెం గ్రామాల్లో గురువారం ఆమె పర్యటించారు. ఇటుక బట్టీల్లో పనికి పశ్చిమ బెంగాల్ నుంచి వలస వచ్చిన కూలీలతో మాట్లాడారు. బడి వయస్సు పిల్లలందరూ బడిలోనే గడపాలని, వారి పిల్లలను దగ్గర్లోని పాఠశాలల్లో చేర్పించాలని అవగాహన కల్పించారు. అవసరమైతే వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తామన్నారు. ఇటుక బట్టీల యజమానులు బాధ్యత తీసుకుని తమ వద్ద పని చేస్తున్న వలస కార్మికుల పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వరప్రసాద్, ఆయా గ్రామాల కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సర్పంచ్ రాంబాబుకు ఘన సత్కారం

ఆలమూరు: కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా ఇటీవల ఉత్తమ అవార్డు అందుకున్న గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబును గురువారం పలువురు నేతలు ఘనంగా సత్కరించారు. ఆలమూరు తాలుకా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ ట్రెజరర్ చుండ్రు శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు రాయుడు సుధాకర్ తదితరులు రాంబాబును సన్మానించారు. గ్రామాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మామిడికుదురు: పంచాయతీ వీధిలైట్ల బిల్లులు చెల్లించలేని పరిస్థితుల్లో ఉన్నామని, సంబంధిత శాఖ ఉద్యోగులు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తే ప్రభుత్వమే బాధ్యత వహించాలని మండల సర్పంచ్‌ల సమాఖ్య సమావేశం తీర్మానించింది. సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు అధ్యక్షతన గురువారం ఈ సమావేశం జరిగింది. వర్షాకాలంలో అంటువ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉన్నప్పటికీ పంచాయతీ ఆధ్వర్యంలో కనీస పారిశుద్ధ్య పనులు కూడా చేపట్టే పరిస్థితి తమకు లేదని సమావేశం వాపోయింది. బ్లీచింగ్‌తో పాటు ముగ్గు కూడా కొనే పరిస్థితి లేదన్నారు. పంచాయతీలకు రావల్సిన నిధుల్ని పంచాయతీ ఖాతాలకు జమ చేయడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల్లో మట్టి అక్రమ తవ్వకాలను అడ్డుకున్న సర్పంచ్ పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తీర్మానాల ప్రతిని తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బళ్ల శ్రీనివాసరావు, చెల్లుబోయిన రామశివ సుబ్రహ్మణ్యం, సుందరనీడి రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ఉమా మందేశ్వరస్వామి గ్రామోత్సవం

కొత్తపేట: మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా మందపల్లిలో ఉమా మందేశ్వర (శనైశ్చర) స్వామి వారి గ్రామోత్సవం గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ సింగం రాధ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన ఉదయం నుంచీ స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పార్వతీదేవి అమ్మవారికి కుంకుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం బ్యాండు, తీన్‌మార్, కాంతారా మహిషాసురమర్దిని ప్రదర్శనల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యుడు తోరాటి గణేష్, ప్రధానార్చకుడు అయిలూరి శ్రీరామమూర్తి, వేద పండితులు పాల్గొన్నారు.

దాడి చేసిన నిందితులకు రిమాండ్

ఆలమూరు: మడికి శివారు నాగులపేటలో దాడులకు పాల్పడిన 11 మంది నిందితులకు ఆలమూరు జూనియర్ జడ్జి సివిల్ కోర్టు రిమాండ్ విధించింది. ఎస్సై ఎస్.శివప్రసాద్ కథనం ప్రకారం.. ఈ కేసులో మరికొందరు కూడా ఉన్నారు. వారి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. గురువారం మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

చిన్నారుల వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో చిన్నారులకు వ్యాపించే వ్యాధులపై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని వైజాగ్ రీజినల్ ట్రెనింగ్ సెంటర్ (ఎఫ్) కమ్యూనికేషన్ అధికారి విష్ణు అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీని గురువారం ఆయన పరిశీలించారు. చిన్నారులకు వచ్చే వ్యాధులపై వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ బి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

అయినవిల్లి: ముక్తేశ్వరం రేవు వద్ద శివరాత్రి ఏర్పాట్లను సర్పంచ్ కాకర శ్రీనివాస్ పరిశీలించారు. ఇక్కడ పుణ్యస్నానాలు చేసేందుకు అధిక సంఖ్యలో భక్తులు రానున్నందున, అందుకు తగినట్టుగా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని తెలిపారు.